‘రెవెన్యూ’.. రెడీనా..!

ఆనందపురం మండలంలో కబ్జాల పర్వం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడం, రెవెన్యూ అధికారులు కూడా వారికే కొమ్ము కాస్తుండటంతో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులందాయి. దీంతో కలెక్టరే స్వయంగా సమావేశం నిర్వహించారు. ఆనందపురం ఎంపీడీవో కార్యాలయం కేంద్రంగా బుధవారం జరిగిన రెవెన్యూ కాన్ఫరెన్స్‌లో అన్యాక్రాంతమైన భూములను గుర్తించి తగు చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని భీమిలి డివిజన్ రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్ ఆదేశించిన సంగతి తెలిసిందే. మరి ఆ ఆదేశాలనైనా అధికారులు అమలు చేస్తారా.. వేచి చూడాల్సిందే..


ముకుందపురంలో కొండను తవ్వి గ్రావెల్ తరలించిన దృశ్యం


ప్రభుత్వ స్థలంలో వెలిసిన పశువుల పాక

కలెక్టర్ ఆదేశాలైనా అమలు చేస్తారా?

- మండలంలో పలుచోట్ల ఆక్రమణలు
- ‘కూటమి’ నేతలకు కొమ్ము కాస్తున్న అధికారులు
- కబ్జాదారుల కోరల్లో రూ.కోట్ల భూములు

తగరపువలస: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆనందపురం మండలంలో ముఖ్యంగా టీడీపీ నాయకులు పదుల సంఖ్యలో డి.పట్టాభూములు, కొండ పోరంబోకు స్థలాలను ఆక్రమించిన సంగతి తెలిసిందే. రూ.కోట్ల విలువైన భూములు ఆక్రమణకు గురవుతున్నా గ్రామస్థాయిలో ఉన్న రెవెన్యూ, సచివాలయ సిబ్బంది నుంచి తహసీల్దార్ వరకు టీడీపీ నాయకులకే కొమ్ము కాస్తున్నారు. దీంతో స్థానికులు వీరికి చెబితే, చెవిటివాని ముందు శంఖం ఊదినట్టేనని భావించి కలెక్టర్, ఆర్డీవో స్థాయి అధికారుల చుట్టూ ఫిర్యాదులతో తిరుగుతున్నారు.

హెచ్చరిక బోర్డులను తొలగించి..

మండలంలో ఎక్కువగా కుసులవాడ, శొంఠ్యాం, రామవరం, పందలపాక, ముకుందపురం, బోని, లొడగలవానిపాలెం పంచాయతీలలో ప్రభుత్వ భూములపై టీడీపీ నాయకులు కన్నేశారు. అధికారులు సకాలంలో గుర్తించి హెచ్చరికల బోర్డులు పెట్టినా వాటిని దౌర్జన్యంగా తొలగించి షెడ్ల నిర్మాణం, గడ్డి కుప్పలు పెట్టడం, నీలగిరి మొక్కలు నాటడం వంటి కార్యక్రమాల ద్వారా ఆక్రమణలకు శ్రీకారం చుడుతున్నారు. తరువాత వాటిని తమకు అనుకూలంగా ఉన్న అధికారుల సాయంతో విక్రయిస్తున్నారు.

- మండలంలో ముకుందపురం పంచాయతీ సర్వే నంబర్ 120 మొదలుకుని బోని పంచాయతీలోని రామునేనిపేట వరకు కొండవాలు ప్రాంతంలో వందల సంఖ్యలో షెడ్లు, గడ్డికుప్పలు, గాదెలు, కమ్మల పాకలు వెలిశాయి. ఇటీవల టీడీపీ నాయకులు ముకుందపురంలోని కొండ గ్రావెల్‌ను పట్టపగలే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ పంచాయతీలో సుమారు 5 ఎకరాలలో ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం అయినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయతీలో రోడ్డును ఆనుకుని ఎకరా రూ.3.50 కోట్లు ఉంటే కొండవాలు ప్రాంతంలో రూ.2 కోట్లు ఉంటుందని తెలిపారు.
- ఇదే సర్వే నంబర్ కుసులవాడ పంచాయతీలోని రేగానిగూడెంలో ఒకే పేరుతో ఉన్న కుటుంబ సభ్యులు ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలంలో నీలగిరి మొక్కలు వేసి ఆక్రమించారు. గతంలో ఆనందపురం రెవెన్యూ అధికారులు హెచ్చరికల బోర్డులు పెట్టినా తొలగించడం విశేషం.

ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఇప్పటి వరకు ఆక్రమణలకు గురైన కోట్ల విలువ చేసే భూములను కబ్జాదారుల చెరనుంచి విడిపించి రక్షించాలని ఆనందపురం మండల ప్రజలు కోరుతున్నారు.


గ్రీన్‌మ్యాట్‌లు అడ్డం పెట్టి ఆక్రమించిన ప్రభుత్వ స్థలాలు

క్లుప్తంగా

బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలి


ఓజోన్ వ్యాలీ వద్ద బాణసంచా స్టాల్స్ ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మధురవాడ: ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు లోబడే బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని వివిధ శాఖల అధికారులు వ్యాపారులకు సూచించారు. హైవేను ఆనుకుని ఉన్న కొమ్మాది ఓజోన్ వ్యాలీ రోడ్డులో దుకాణాలు ఏర్పాటు చేయనున్న స్థలాన్ని శనివారం వారు పరిశీలించారు. ఇక్కడ 33 దుకాణాలకు దరఖాస్తు చేసుకోగా, అనుమతి లభించినట్లు వ్యాపారులు చెప్పారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. జెడ్సీ సింహాచలం, ఏసీపీ శబ్‌నాన్ శాస్త్రి, సీఐ బాలకృష్ణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లమ్మ ఆలయ వార్షికోత్సవం


కూరగాయలతో తయారు చేసి, అలంకరించిన అమ్మవారి ప్రతిమ

తగరపువలస: వలందపేట జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పైడితల్లమ్మ ఆలయ 15వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపకుడు వంక ఎర్రయ్య, కుటుంబ సభ్యులు అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, హోమం తదితర కార్యక్రమాల అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు చిల్ల సూర్యనారాయణరెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. వంక కుటుంబ సభ్యులు ఆవరణలోని వేపచెట్టు వద్ద గుమ్మడికాయలు, పుచ్చకాయలతో అమ్మవారిని తయారు చేసి, కూరగాయలతో అలంకరించారు. ఈ అలంకరణ భక్తులను ఆకట్టుకుంది.

ఆధునిక సాంకేతికతతో పోలీస్ వ్యవస్థ పటిష్టం

డీసీపీ–1 అజిత వేజెండ్ల


మాట్లాడుతున్న డీసీపీ అజిత వేజెండ్ల

పీఎం పాలెం: అభివృద్ధి చెందిన సాంకేతికత కారణంగా ఆధునిక ఆయుధాలు, సాంకేతిక పరికరాలు అందుబాటులోకి రావడంతో పోలీస్ వ్యవస్థ ఎంతో శక్తివంతమైందని నగర డీసీపీ–1 అజిత వేజెండ్ల అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా శనివారం సాయంత్రం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆయుధాలు, సాంకేతిక పరికరాల ప్రదర్శనలో ఆమె మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో అమరులైన పోలీసులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ప్రజల శాంతిభద్రతల పరిరక్షణలో రక్షణ కవచంగా నిలిచే పోలీస్ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన ఉండాలన్నారు. పోలీసులు వివిధ సందర్భాలలో వినియోగించే ఆయుధాలు, వాటి శక్తి సామర్థ్యాల గురించి స్థానిక ఏసీపీ అప్పలరాజు వివరించారు. నేరస్తులను పట్టుకునేందుకు వినియోగించే ఆధునిక సాంకేతిక పరికరాలు, డాగ్ స్క్వాడ్‌ల పనితీరు గురించి సీఐలు బాలకృష్ణ విద్యార్థులకు వివరించారు. నార్త్ సబ్ డివిజన్ సీఐలు బి.సుధాకర్, సీహెచ్ సుధాకర్, వాసునాయుడు ఎస్‌ఐలు ఎన్.సునీత, కె.భాస్కర్, ఈ ప్రాంతంలోని విద్యాసంస్థల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ఆయుధాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఏసీపీ అప్పలరాజు తదితరులు

శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

కొమ్మాది: బీచ్ రోడ్డు రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి (టీటీడీ) భక్తులు పోటెత్తారు. శనివారం శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాటాలు, శ్రీవారి నామ సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

సవరణలకు 31 దరఖాస్తులు

తగరపువలస: పద్మనాభం మండలం బుడ్డివలస అగ్రహారంలో రీసర్వేలో దొర్లిన తప్పుల సవరణకు శనివారం నిర్వహించిన గ్రామసభకు 31 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో జాయింట్ ఎల్‌పీఎం, ఎక్స్‌టెంట్, పేర్లు, సరిహద్దు సవరణలకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయి. ప్రజల నుంచి ఈ అభ్యంతరాలను అధికారులు స్వీకరించారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జాతీయ రహదారి నుంచి రుషికొండ వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో జీవీఎంసీ వాటర్ పైప్‌లైన్ పగలడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పైప్‌లైన్ పగిలి నెలలు కావస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో ఆ ప్రదేశం పెద్ద గొయ్యిలా మారి, రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీనిపై శనివారం సాక్షి దిన పత్రికలో ‘ఇంత నిర్లక్ష్యమా..’ శీర్షికతో ప్రచురించిన వార్తకు ఏఈ సురేష్ స్పందించారు. తక్షణమే ఆ పైపులైన్ మరమ్మతులు ప్రారంభించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

కార్‌షెడ్ జంక్షన్‌లో రద్దీ తగ్గేలా..

ప్రత్యామ్నాయ మార్గాలపై అధికారుల చర్చలు

మధురవాడ: ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు ట్రాఫిక్‌ను మళ్లించడానికి ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అన్వేషిస్తున్నట్లు విశాఖ నార్త్ జోన్ ట్రాఫిక్ సీఐ ఎన్.సాయి తెలిపారు. ఆర్టీసీ డిపో మేనేజర్ బాబూరావుతో కలసి శనివారం మధ్యాహ్నం హైవే నుంచి సర్వీసు రోడ్డు ద్వారా ఇతర ప్రాంతాలకు వెళ్తున్న ఆర్టీసీ బస్సుల రూట్ మ్యాప్, ట్రాఫిక్‌ను మళ్లించడానికి చేపట్టవలసిన చర్యలపై చర్చించారు. ముఖ్యంగా కార్ షెడ్ జంక్షన్ నుంచి వుడా కాలనీ, వాంబేకాలనీ, ఆర్టీసీ డిపో, ఐటీ సెజ్ వైపు వెళ్తున్న బస్సుల రూట్ మార్పుపై సాధ్యాసాధ్యాలను చర్చించారు. తద్వారా కొంతమేర ట్రాఫిక్ తగ్గే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.


కార్‌షెడ్ జంక్షన్ వద్ద సీఐ సాయితో చర్చిస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: డయేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. సాగర్‌నగర్, ఎండాడ ఏరియాలోని బాలాజీ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని శనివారం సందర్శించిన డీఎంహెచ్‌వో, అక్కడ జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటా సర్వే చేసి ఎవరికైనా డయేరియా లక్షణాలు కనిపిస్తే సత్వర చికిత్స అందించాలని, ఈ విషయాన్ని తమకు తెలియజేయాలని తెలిపారు. వ్యాధి నిరోధక టీకాలు వేసే ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి వ్యాక్సిన్ షెడ్యూల్ గురించి తెలుసుకున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


బాలాజీనగర్ యూపీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

వికలాంగుల కాలనీ నుంచి వైన్ షాపు తరలింపు

మధురవాడ: జీవీఎంసీ 8వ వార్డు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ వద్ద వికలాంగుల కాలనీలో వైన్ షాపును అధికారులు ఎట్టకేలకు వేరే చోటుకు తరలించారు. తమ కాలనీలో వైన్ షాపు వద్దంటూ స్థానికులు శ్రీ వెంకటేశ్వర రెసిడెన్షియల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా ధర్నాలు, ఆందోళనలు చేపడుతూ వచ్చారు. ఇటీవల ఆందోళన మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. వీరి ఆందోళనలు, నిబంధనల ఉల్లంఘనలపై సాక్షి దినపత్రికలో వరుసగా వార్తలు ప్రచురితమయ్యాయి. ఎట్టకేలకు ఎక్సైజ్ శాఖ, ఇతర అధికారులు స్పందించారు. వైన్ షాపును వేరే చోటుకు తరలించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి గ్రామానికి తాగునీరు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ హయాంలోనే జల జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి గ్రామానికి తాగునీరు అందించే కార్యక్రమానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఆ పార్టీ ఆనందపురం మండల నాయకుడు పినిశెట్టి సింహాచలం నాయుడు అన్నారు. కణమాం పంచాయతీ గోరింటలో జలజీవన్ మిషన్ నిధులు రూ.41 లక్షలతో చేపట్టనున్న పథకానికి సర్పంచ్ ఆబోతుల అప్పలరాము శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సింహాచలం నాయుడు మాట్లాడుతూ 2022 డిసెంబరులో ఈ పథకానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఈ పనులకు అంతరాయం కలిగిందని అన్నారు. స్థానిక నాయకులు యర్ర రాము, కృష్ణ, రమణ, పంచాయతీ కార్యదర్శి కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే సమక్షంలోనే కొట్టుకున్నారు

భీమునిపట్నం: టీడీపీ నాయకుల్లో విభేదాలు ఎప్పటికప్పుడు బయటపడుతూనే ఉన్నాయి. తాజాగా భీమిలి నియోజకవర్గస్థాయి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే ముందే ఆ పార్టీ నేతలు కొట్టుకోవడం అక్కడున్న వారిని ముక్కున వేలేసుకునేలా చేసింది. వివరాలివి.. తెలుగుదేశం పార్టీ భీమిలి నియోజకవర్గ స్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయం వద్ద శనివారం ప్రారంభమైంది. కార్యక్రమం జరుగుతూ ఉండగా మాజీ కౌన్సిలర్లు, ప్రస్తుత రెండో వార్డు అధ్యక్ష, కార్యదర్శులు బడికంటి నీలకంఠం, పిట్లా వెంకటరావు మనస్పర్థల కారణంగా కొట్టుకున్నారు. దీంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త వాతావణం నెలకొంది. ఎమ్మెలే గంటా సమక్షంలోనే ఇలా జరగడంతో ఆయన కూడా అవాక్కయ్యారు. వెంటనే అక్కడ ఉన్నవారు వారిని నిలువరించడంతో పరిస్థితి సద్దుమణిగింది. అనంతం ఎమ్మెల్యే వారిని పిలిచి మందలించడంతో పాటు, సర్దిచెప్పారు.

హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

పీఎం పాలెం : ఆరిలోవ బాలాజీనగర్‌కు చెందిన జామి వెంకట్ నవీన్‌పై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని పీఎం పాలెం పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. ఈ నెల 23వ తేదీ రాత్రి 9.30 గంటలకు ఐటీ ఉద్యోగి శ్రీపాద శశికాంత్ డ్యూటీ నిమిత్తం భీమిలి బీచ్ రోడ్డు ఐటీ జంక్షన్ నుంచి జూవల్ అపార్ట్‌మెంట్ రోడ్డులో తన బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి తలపై తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉండటం గుర్తించారు. వెంటనే 102కు ఫోన్ చేయగా బీచ్ మొబైల్ పోలీసులు వచ్చి గాయపడి వ్యక్తిని 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన వ్యక్తిని జామి వెంకట నవీన్‌గా గుర్తించారు. ఇదిలా ఉండగా శనివారం 11 గంటల ప్రాంతంలో ఐటీ సెజ్ జంక్షన్‌లో పోలీసులను చూసి పరుగుపెడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నించగా, వెంకట్ నవీన్‌ను చంపడానికి యత్నించామని, ఆరిలోవ బాలాజీనగర్ ప్రాంతానికే చెందిన మన్యాల సింహాద్రిని ఇనుప రాడ్డుతో కొట్టామని నేరం అంగీకరించారు. ఇదే కేసులో ఉన్న మైనర్‌ను జువెనల్ హోమ్‌కు, సింహాద్రిని సెంట్రల్ జైల్‌కు తరలించామని సీఐ తెలిపారు.

పైడిరాజుకు కాంస్య పతకం

కొమ్మాది: గీతం దంత వైద్య కళాశాలలో ఏఎస్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న కనకల పైడిరాజు 36వ మలేషియా ఇంటర్నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఇండియా తరఫున పాల్గొని కాంస్య పతకం సాధించారు. మలేషియాలోని బుకత్‌జలీల్ స్టేడియంలో ఈ నెల 10 నుండి 19వ తేదీ వరకు జరిగిన పోటీల్లో 800 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని, కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా పైడిరాజును ఎంపీ శ్రీ భరత్ అభినందించారు.

నేటి నుంచి అనంతుని పవిత్రోత్సవాలు

పద్మనాభం: స్థానిక కుంతీ మాధవస్వామి ఆలయంలో ఆదివారం నుంచి అనంత పద్మనాభస్వామి పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు ఆ రోజు సాయంత్రం 6 గంటలకు మొదలవుతాయి. మిగిలిన మూడు రోజులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిత్యహోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ప్రసాద వితరణ చేయనున్నారు. చివరి రోజైన బుధవారం ఉదయం 11 గంటల నుంచి శ్రీదేవి, భూదేవి సమేత అనంత పద్మనాభస్వామి శాంతి కల్యాణం జరిపిస్తారు. పూర్ణాహుతి, ప్రసాద వితరణతో పవిత్రోత్సవాలు ముగుస్తాయి.

28న కౌలుదారు చట్టంపై అవగాహన

తగరపువలస: ఈ నెల 28న మధ్యాహ్నం 2.30 గంటలకు నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో కౌలుదారు చట్టంపై అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారులు తెలిపారు. కలెక్టర్, వ్యవసాయశాఖ కమిషనర్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యే సమావేశానికి భీమిలి డివిజన్‌లోని మూడు మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు, ఉద్యానవన శాఖాధికారులు, సిబ్బంది, రైతులు, కౌలు రైతులు హాజరుకావాలని కోరారు. ఈ-క్రాప్‌తో పాటు కౌలుకు సంబంధించిన సమస్యలపై సందేహాలను అధికారులు నివృత్తి చేస్తారని తెలియజేశారు